క్లుప్తంగా

మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు



ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు గోవిందు ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించకుని మొక్కులు తీర్చుకున్నారు.

వీఆర్వోల సంఘం మండలాధ్యక్షుడిగా రవి



పత్తికొండ(తుగ్గలి): పత్తికొండ మండల వీర్వోల సంఘం అధ్యక్షుడుగా డి.రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. వీఆర్వోలందరూ సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.రవి, ఉపాధ్యక్షుడిగా టి.కేశన్న, ట్రెజరర్‌గా సాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కేఎం బాషా, సహాయ కార్యదర్శిగా సుజాత, సంయుక్త కార్యదర్శిగా కె.ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వంట ఏజెన్సీని మార్చాలి



తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆస్పరి: మండలంలోని నగరూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వంట ఏజెన్సీనీ మార్చాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, మహేంద్ర, నవీన్, నరేంద్ర మంగళవారం తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుచున్నారన్నారు. భోజనం రుచికరంగా లేనందున చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారన్నారు. వంట ఏజెన్సీని మార్చకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు.


31న శరణ రామలింగేశ్వర తాత పుణ్యారాధన



శరణ రామలింగేశ్వర స్వామి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో కొలువైన శరణం రామలింగేశ్వర తాత 86వ పుణ్యారాధన కార్యక్రమాన్ని ఈనెల 31, జనవరి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. భక్తులు తాత పుణ్యారాధన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎల్లార్తి దర్గాను దర్శించుకున్న వక్ఫ్‌బోర్డు డైరెక్టర్



దర్గాకు దర్శనానికి వస్తున్న వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జనాబ్ షేక్ ఖాజాసాబ్

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను వక్ఫ్‌బోర్డు డైరెక్టరు జనాబ్ షేక్ ఖాజాసాబ్ మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. దర్గాలో ప్రత్యేక ఫాతెహేలు నిర్వహించారు. అనంతరం ఆయనకు నిర్వాహకులు దర్గా ఫొటో, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దర్గాల్లో కలియ తిరిగి భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు అర్జున్, భాషా, సర్ధార్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుదీప కాంతులతో ముస్తాబైన చర్చి

కృష్ణగిరి: క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. క్రీస్తు విశ్వాసుల అతి ముఖ్యమైన పండుగ క్రిస్మస్‌ను బుధవారం ఘనంగా జరుపుకునేందుకు కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుదీప కాంతులతో ముస్తాబు చేశారు. చర్చిలతోపాటు క్రైస్తవుల ఇళ్లు విద్యుద్దీప కాంతులతో క్రిస్మస్ స్టార్లతో కాంతులీలుతున్నాయి. ప్రత్యేక పార్థనలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా చర్చిల పాస్టర్లు తెలిపారు.

కరెంటు చార్జీలపై..

27న వైఎస్సార్‌సీపీ పోరుబాట

- ప్రజల పక్షాన విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన
- పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు తరలిరావాలి
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పిలుపు



ఆలూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి, పార్టీ నాయకులు

ఆలూరు రూరల్: పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపడుతున్నట్లు ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి తెలిపారు. కూటమి సర్కార్ ప్రజలపై మోపుతున్న అదనపు భారాన్ని నిరసిస్తూ ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రం ఆలూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చేపట్టనున్న పోరుబాటకు వైస్సార్‌సీపీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలపై ఏ భారం మోపమని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి పెద్దలు అధికారంలో వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ప్రజావ్యతిరేకత చవిచూస్తారని హెచ్చరించారు.

రెండు నెలల్లో రూ.15,485 కోట్ల అదనపు భారం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరుతో రెండు దఫాలు రూ.15,485 కోట్ల భారం మోపి ప్రజల నడ్డి విరిచారని ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. త్వరలో మరింత భారాన్ని మోపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు..అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే యూజర్ చార్జీల పేరుతో ప్రజలు కోలుకోలేకుండా భారం మోపారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసం మరోసారి నిరూపితమైందన్నారు. బాబు షూరిటీ..బాదుడు గ్యారంటీలా చంద్రబాబు పాలన ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఉరుకుందు, నాగేంద్ర, తిమ్మప్ప, భాస్కర్, హొళగుంద మండల కన్వీనర్ షఫీవుల్లా, ఆలూరు కో-కన్వీనర్ వీరేష్, నాయకులు అరికెర వెంకటేష్, శివన్న, గుండయ్య, గిరి, వీరభద్రి, శేఖర్, మల్లికార్జున బి.శేఖర్, అనీల్ రెడ్డి, హనుమంతప్ప, వెంకటేశులు, బాబు, నాగేష్, జే.వీరేష్ రాజు, వరుణ్, మహబూబ్ బాషా, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాదుడు తప్పా భరోసా ఏదీ?



'విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

- కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు వాత
- ప్రజలను మోసం చేయడంలో బాబు నేర్పరి
- విద్యుత్ వినియోగదారులకు వరుస షాకులు
- చార్జీల పెంపునకు నిరసనగా 27న పత్తికొండ విద్యుత్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆందోళన

వెల్దుర్తి(కృష్ణగిరి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ బిల్లుల భారం మోపిందని, చార్జీలు తగ్గించే వరకు పోరాటం చేస్తామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు.చెరుకులపాడు గ్రామంలోని స్వగృహంలో మంగళవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో మోయలేని భారం వేసిందని విమర్శించారు. నవంబర్‌లో రూ.6 వేల కోట్లు, డిసెంబర్‌లో రూ.9 వేల కోట్లకుపైగా విద్యుత్‌చార్జీల రూపంలో ప్రజలపై అదనపు భారం వేసిందన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు.. అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు యూజర్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. బాబు షూరిటీ.. బాదుడు గ్యారెంటీ అని ఎద్దేవా చేశారు. గత టీడీపీ పాలనలోనూ విద్యుత్ రంగాన్ని నిట్టనిలువునా ముంచేస్తూ డిస్కంలను పూర్తిగా నష్టాల్లోకి నెట్టారని, 24 శాతం వార్షిక అప్పులతో డిస్కంలు కుదేలయ్యేలా చేశారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.47 వేల కోట్లను డిస్కంలకు అందించి చేయూత ఇచ్చారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు జరిగే ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, నారాయణదాస్, జెడ్పీటీసీ సుంకన్న, నాయకులు భాస్కరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, కురువ రామకృష్ణ, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



బసినేపల్లిలో సదస్సులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

మద్దికెర: సుదీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ పేర్కొన్నారు. మంగళవారం బసినేపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్న భూయజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ నిబంధనలను అనుసరించి హక్కులు కల్పించడం జరుగుతుందన్నారు. వీఆర్వో శివన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులు భూసమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే రీసర్వే చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సర్వేయర్ హేమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు

చిప్పగిరి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మండలంలో మొక్కుబడిగా సాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ సదస్సులు 27వ తేదీ ముగియనున్నాయి. మంగళవారం మండలంలోని డేగులహాలు గ్రామంలో తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ముక్కుబడిగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు అంజి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సర్పంచ్ నీలకంఠ, స్థానిక నాయకులు మీసాల రామాంజి నేయులు తదితరులు పాల్గొన్నారు.

కోగిలతోటలో రెవెన్యూ సదస్సు

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట మంగళవారం తహసీల్దార్ సతీష్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గాదిలింగప్ప తాత ఆలయం నుంచి గ్రామంలో నుంచి గూళ్యం రోడ్డు వరకు రస్తాను కొలిచి హద్దులు చూపాలని కోరుతూ కోగిలతోట గ్రామపెద్దలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వివిధ సమస్యలపై 26 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

నిట్రవట్టిలో రెవెన్యూ సదస్సు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ నజ్మాభాను రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూసమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగప్ప, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ మహేష్, మండల సర్వేయర్ మంజు భార్గవి, ఎండోమెంట్ ఆఫీసర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు

తుగ్గలి: మండల పరిధిలోని లింగనేనిదొడ్డిలో మంగళవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. డీటీ నాగరాజు, వీఆర్వో వెంకటరాముడు, ఫారెస్ట్, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పరిలో రెవెన్యూ సదస్సు

ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరిలో మంగళవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ నిర్ణీత సమయంలో సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో ఆర్డీఓ సమావేశం

తుగ్గలి: రైల్వే డబుల్‌లైన్ కోసం భూములు కోల్పోయిన రైతులతో ఆర్డీఓ భరత్‌నాయక్ సమావేశం నిర్వహించారు. రాంపల్లి, చెన్నంపల్లి, పెండేకల్లు రైతులతో మంగళవారం రాంపల్లిలో సమావేశం నిర్వహించి పరిహారంపై వారి అభిప్రాయాలను సేకరించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందన్నారు. అనంతరం జొన్నగిరిలో రస్తా వివాదంపై నెలకొన్న సమస్యపై విచారించారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ నాగరాజు, వీఆర్వోలు ఉన్నారు.

ఆలయానికి విరాళం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయం అభివృద్ధి కోసం స్థలం కొనుగోలు చేసేందుకు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆలయ తూర్పు రాజగోపురం ముందు భాగాన ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసేందుకు రాయచూరు పట్టణానికి చెందిన బైసాని వాణి, జయరాం, బాలాజీ, విజయలక్ష్మి రూ.20,116 విరాళాన్ని కార్యనిర్వహణాధికారి వీరయ్యకు మంగళవారం అందజేశారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆలూరు: ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆటో యూనియన్ నియోజక వర్గం గౌరవ అధ్యక్షుడు ,జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, సీపీఎం మండల కార్య దర్శి షాకీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జ్యోతి బసు భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం నూతన ఆటోలను మంజూరు చేయడమే కాకుండా కార్మిక చట్టాలను అమలు చేస్తామని నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఆర్టీఓల వేధింపులు అధికమయ్యాయని, ఇష్టారాజ్యంగా జరిమానాలు విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులపై అధికారుల వేధింపులకు అడ్డుకట్ట వేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనక చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

నిబంధనల ప్రకారం పోస్టులు భర్తీ చేయాలి

ఆలూరు రూరల్: విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని హొళగుంద మండలం కోగిలతోట సబ్‌స్టేషన్ ఆపరేటర్ పోస్టు నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని మంగళవారం సీఐటీయూ నాయకులు ఆలూరు సర్కిల్ ఏఈ గురప్పకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమంతు, సీపీఎం మండల నాయకులు షాకీర్ మాట్లాడారు. ఆలూరు విద్యుత్ శాఖలో కొన్నేళ్లుగా నోటిఫికేషన్ జారీ చేయకుండా డబ్బులు దండుకుని అక్రమ నియామకాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ మధ్యకాలంలోనే కోగిలతోట సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా నియమించిన 9 నెలల తర్వాత అభ్యర్థివి నకిలీ సర్టిఫికేట్లని తేలడంతో ఉన్నతాధికారులు విచారణ చేసి తొలగించడం జరిగిందన్నారు. ఇక నుంచి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి అవినీతికి తావు లేకుండా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేతల ఆశలు గల్లంతు

తుగ్గలి: సహకార సంఘాల అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకులకు షాక్ తగిలింది. చైర్మన్లుగా, పాలక మండలి సభ్యులుగా పదవులు పొందుతామని కొందరు నేతలు ఆశపడ్డారు. అయితే మరో ఆరు నెలల పాటు ప్రత్యేకాధికారి పాలనను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎన్నికైన వారు డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా నియమితులవుతుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సంఘాలకు ఎన్నికలైనా నిర్వహిస్తారు, లేదంటే నామినేట్ అయినా చేస్తారని నాయకులు భావించారు. అయితే అలా జరగకపోవడంతో పదవులపై ఆశలు పెట్టుకున్న వారు నిరాశకు గురవుతున్నారు. పత్తికొండ బ్యాంకు పరిధిలో నాలుగు మండలాల్లో ఆరు వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మరో ఆరు నెలలు పాటు పాతవారే ప్రత్యేక అధికారులుగా కొనసాగనున్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



ఎస్‌హెచ్ ఎర్రగుడి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

కృష్ణగిరి: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ మోహన్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలోని సచివాలయం, అలాగే మన్నెకుంట, రామకృష్ణాపురం గ్రామాల్లో చేపడుతున్న సీసీ రహదారులను ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లోని సచివాలయాలకు సిబ్బంది సకాలంలో రావడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సీసీ రహదారుల నిర్మాణాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ రామస్వామి, ఏపీఓ నాగ సులోచన, పంచాయతీ కార్యదర్శి సుంకన్న ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆలూరు రూరల్: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరతూ సమ్మె చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మైనా, ఉమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంళవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 40 రోజులగా చేస్తున్న సమ్మెతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారే లేక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలూరు గిరిజన బాలికల గురుకులంలో 3 నుంచి 10వ తరగతి వరకు 297 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మరో రెండు నెలల్లో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుడడంతో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చొరవ తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

బుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్ మంజూరు చేయాలి

హొళగుంద: బేడ బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి కుల సర్టిఫికెట్ మంజూరు చేయాలని మాల మహానాడు నాయకులు హెబ్బటం వన్నూరప్ప, లింగంపల్లి మల్లికార్జున డిమాండ్ చేశారు. వారు మంగళవారం మాట్లాడుతూ ఏళ్ల గడిచినా బుడగ జంగాలీల జీవితాలు బాగు పడడం లేదన్నారు. కుల సర్టిఫికెట్ లేకపోవడంతో రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని, నేటికీ దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎం.కొట్టాల రేషన్ షాపు ఎస్సీలకు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఆలూరు రూరల్: మండలంలోని ఎం.కొట్టాల రేషన్ షాపును రోస్టర్ పద్ధతిన ఎస్సీలకు కేటాయించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందించారు. గ్రామస్తులు గ్రామస్తులు రాజు, రామాంజినేయులు, దాసప్ప, ఆశీర్వాదం మాట్లాడుతూ రేషన్ షాపు నంబర్ 25 పరిధిలో ఎస్సీ,బీసీ కులానికి చెందిన వారే నివాసం ఉన్నారని, అయితే ఇటీవలే ఉన్నతాధికారులు ఈ రేషన్ షాపును ఎస్టీలకు కేటాయించారన్నారు. డిగ్రీ,పీజీలు చేసిన ఎస్సీ నిరుద్యోగులు అన్యాయం జరుగుతోందన్నారు.

ఆదాయ వనరులు పెంచేందుకు చర్యలు



మాట్లాడుతున్న ఈఓ శివకుమార్

మద్దికెర: స్థానిక మేజర్ పంచాయతీకి ఆదాయ వనరులు పెంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈఓ శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద 12 గదులు, ప్రధాన బజారు వద్ద 14 గదులు నిర్మించడం జరిగిందన్నారు. సభ్యుల తీర్మానం ప్రకారం వాటిని ఎలాంటి వేలంపాట లేకుండా వ్యాపారులకు అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మరిన్ని పనులు చేసేందుకు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఆంజనేయులు, ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు కిట్టి, జంబురాయుడు, రామకృష్ణ, వరప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం



ఏఐవైఎఫ్ నూతన కమిటీ సభ్యులు

ఆస్పరి: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా సమితి సభ్యులు క్రిష్ణమూర్తి, నాగేంద్రయ్య విమర్శించారు. ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో ఏఐవైఎఫ్ 10వ మండల మహా సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఒక్క ఉద్యోగం కూడ ఇవ్వలేదన్నారు. అదేవిధంగా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తకపోవడం అన్యాయమన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు సమక్షంలో మండల కమిటీ అధ్యక్షుడుగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, ఇస్మాయిల్, ఈశ్వర్, రామచంద్ర, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వీరేష్, రాజు, శేఖర్, దస్తగిరి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి




ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆస్పరి: పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆస్పరిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్లేట్లు పట్టుకుని బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, అనిల్, రాజు, బాలు, దివాకర్, రెహమాన్ పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లు, నాణేల ప్రదర్శన



నాణేలు, కరెన్సీ నోట్లను ఆసక్తిగా తిలకిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సేకరణకర్త నాగేష్‌బాబును సన్మానిస్తున్న దృశ్యం

150 దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు, నాణేలతో కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంఈఓ సునంద, హెచ్ఎం కల్పనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆస్పరి మండలం, బనవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నగేష్‌బాబు ప్రపంచంలోని వివిధ దేశాలకు సంబంధించి వివిధ సమయాల్లో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు, నాణేలు సేకరించడం సంతోషంగా ఉందన్నారు. సేకరణకర్త నాగేష్‌బాబు మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా వాటిని సేకరించడం అభిరుచిగా మారిందన్నారు. కరెన్సీతోపాటు మొగల్ రాజులు, చాళుక్యులు, చోళులు, శాతవాహన, కుషానుల, మగధ సామ్రాజ్య, ఇక్ష్వాకుల వంశాల కాలంలో వాడిన నాణేలను సేకరించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, కస్తూర్బా, మెయిన్, ఎస్టీ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు నాణేలు, నోట్లను ఆసక్తిగా తిలకించారు.

– కృష్ణగిరి